

సాక్షి ఒడిశా

ఆదివారం । 4 । మే । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5,60,137
బంగారం : 4 గ్రాముల 950 మిల్లీ గ్రాములు
వెండి : 16 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



క్రేన్ కూలి ముగ్గురు మృతి

కటక్ సమీపంలో క్రేన్ కూలి ముగ్గురు చనిపోయారు. ఇద్దరు గాయపడ్డారు.

- IIలో▸



నలుగురు మహిళల అరెస్టు

బంగారం మెరుగుపెడతామని మోసగించారు. కటకటాల వెనక్కి వెళ్లారు.

- IIలో▸

న్యూస్‌రీల్

ఈస్ట్ కోస్ట్ జీఎంతో నబరంగ్‌పూర్ ఎంపీ భేటీ



ఈస్ట్‌కోస్ట్ జీఎంతో నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి చర్చలు జరుపుతున్న దృశ్యం

కొరాపుట్: ఈస్ట్ కోస్ట్ జీఎం పరమేశ్వర్ ఫఖువాల్‌తో నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి శనివారం భేటీ అయ్యారు. శనివారం జీఎం కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. జయపూర్–నబరంగ్‌పూర్, జయపూర్–మల్కన్‌గిరి, మల్కన్‌గిరి–భద్రాచలం, నబరంగ్‌పూర్–జునాఘడ్ ప్రాజెక్ట్ నిర్మాణ పురోగతి పై చర్చించారు. రాయగడ రైల్వే డివిజన్ లోని గుణుపూర్–తెరువల్లి నిర్మాణ పురోగతి సమీక్షించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

గొర్రెలపై హైనా దాడి



మృతి చెందిన గొర్రెలు

కొరాపుట్: గొర్రెల కావడి మీద హైనా దాడి చేయడంతో నాలుగు గొర్రెలు మృతి చెందాయి. శనివారం వేకువజామున నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి పడాల్‌గుడ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వేణుధర్ తాడి తన ఇంటి సమీపంలో గొర్రెల కావడి నుంచి గొర్రెల అరుపులు రావడంతో అక్కడికి చేరుకున్నాడు. అయితే మనుషుల అలికిడి విని ఒక అటవీ జంతువు పరారయ్యింది. లోపలికి వెళ్లి చూస్తే 4 గొర్రెలు మృతి చెందాయి. మరో రెండు తీవ్రగాయాలు పాలై ఉన్నాయి. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. గొర్రెలకు ఉన్న గాయాలు ప్రకారం ఇది హైనా దాడిగా అనుమానించారు. అటవీ శాఖ సిబ్బంది గాయపడిన గొర్రెలకు చికిత్స అందజేస్తున్నారు.

ఈనెల 7 వరకు వర్షాలు

- 8 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

భువనేశ్వర్: రాష్ట్రంలో కాలవైశాఖి వర్షాలు కురుస్తున్నాయి. ఈ వాతావరణం ఈనెల 7వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో 8 జిల్లాలకు బలమైన గాలులు, ఉరుములు, మెరుపులతో పాటు వడగండ్ల వాన సంకేతాలతో తుఫాన్ పోలిన వాతావరణం తాండవిస్తుందని వాతావరణ కేంద్రం సమాచారం. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. వీటిలో మయూర్‌భంజ్, సుందర్‌గఢ్, కెంజొహర్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, గజపతి మరియు గంజాం జిల్లాలు ఉన్నాయి. ఉపరితల గాలులు గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ సూచన. కాల వైశాఖి వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో మరో 22 జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈనెల 7వ తేదీ వరకు ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రానున్న 5 రోజుల్లో సమగ్రంగా పగటిపూట ఉష్ణోగ్రత మారే అవకాశం లేదు. రానున్న రెండు రోజుల్లో కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రత 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ సమాచారం.

శ్మశానంలో తేనెటీగల దాడి



తేనే టీగల బాధితులకు చికిత్స చేస్తున్న దృశ్యం

కొరాపుట్: శ్మశానంలో తేనెటీగలు దాడి చేయడంతో అంత్యక్రియలకు వచ్చిన వారు చెల్లాచెదురయ్యారు. శనివారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి లౌడి గ్రామానికి చెందిన సమికా ఖొరా అనే వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామస్తులు అంత్యక్రియల కోసం శ్మశానంలో ఏర్పాట్లు చేశారు. మృతదేహంపై కర్రలు కప్పుతుండగా తేనెటీగల గుంపు దాడి చేసింది. దీంతో అంతా పరుగులు తీశారు. కొందరు నదిలో దూకారు. 15 మంది గాయపడడంతో వారిని సుంకి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యేలు పీతం పాఢి, రఘురాం పోడాల్, ప్రఫుల్ల పంగి పరామర్శించారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

తండ్రీకొడుకుల దారుణ హత్య

- సరిగుడ గ్రామంలో దారుణం
- ఐదుగురిపై కేసు నమోదు
- పోలీసుల అదుపులో ఒకరు



రక్తపు మడుగులో అగాదు గొమాంగొ మృతదేహం



రక్తపు మగుడులో శంభుర గొమాంగొ మృతదేహం



సరిగుడ గ్రామం



జెనిత గొమాంగొ



అగాదు గొమాంగొ (ఫైల్)

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి లికిటి పాదొరా పంచాయతీలోని సరిగుడ గ్రామంలో దారుణం జరిగింది. గ్రామంలోని తండ్రీకొడుకులను గుర్తు తెలియని దుండగులు మరణాయుధాలతో దాడి చేసి అత్యంత దారుణంగా హతమార్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఐదుగురిపై చంద్రపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, గ్రామస్తులు తెలియజేసిన వివరాల ప్రకారం..

సరిగుడ గ్రామంలో నివసిస్తున్న అగాదు గొమాంగొ (32), శంభుర గొమాంగొ(62)లు తండ్రీకొడుకులు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని కొంతమంది దుండగులు గొమాంగొ ఇంటికి వెళ్లి తగువు పడ్డారు. వాగ్వాదం పెరగడంతో వారు మారణాయుధాలతో దాడికి తెగబడ్డారు. కేకలు వినిపించడంతో అగాదు తండ్రి శంభుర బయటకు వచ్చి చూశాడు. దీంతో దుండగులు అతనిపై కూడా దాడికి దిగారు. అదే సమయంలో అగాదు భార్య జెనిత గొమాంగొ బయటకు వచ్చి చూడగా తన భర్త, మామలపై దుండగులు మరణాయుధాలతో దాడి చేయడం కనిపించింది. దీంతో ఆమె వెంటనే ఇరుగు పొరుగు వారిని తీసుకువచ్చింది. వారు



శంభుర గొమాంగొ (ఫైల్)

వచ్చి చూసేసరికి ఇంటి బయట రక్తపు మడుగులో భర్త అగాదు, మామయ్య శంభుర పడి ఉన్నారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పాత కక్షల కారణంగానే దుండగులు ఇంతటి దారుణానికి ఒడిగట్టినట్లుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అయితే తన భర్త, మామయ్యలపై దాడి చేసి హతమార్చారంటూ బాధితురాలు జెనిత గొమాంగొ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నందపూర్‌పై కాల వైశాఖి ప్రభావం



సిమిలిగుడ రోడ్డులో కూలిన చెట్టు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా నందపూర్ సమితిపై కాలవైశాఖి ప్రకోపం చూపించింది. ఈదురు గాలులతో భారీ వర్షాలు పడడంతో జన జీవనం అస్తవ్యస్తమైంది. సిమిలిగుడ రహదారుల మధ్య భారీ వృక్షాలు కూలడంతో రాకపోకల స్తంభించాయి.నందపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లమ్తాపుట్ సమితి ఉర్దిగుడ గ్రామంలో నవీన్ హంతాల్ ఇంటి పై భారీ వృక్షం పడింది. త్రుటిలో కుటుంబీకులు ప్రాణాలతో బయటపడ్డారు. తహసిల్దార్ దివాకర్ బాగ్, ఫైర్ స్టేషన్ ఒఐసీ చిత్రరంజన్ పంజియాలు సహాయ సహకారాలు, పునరుద్ధరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



శిథిలమైన ఇంటి ముందు నవీన్ హంతాల్ కుటుంబం

ప్రకృతి విపత్తులపై ప్రజలను అప్రమత్తం చేయండి



సమావేశంలో పాల్గొన్న మంత్రి నిత్యానందో తదితరులు

కొరాపుట్: రానున్న వర్షాకాలంలో వచ్చే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ, ప్రాథమిక విద్య, మైనారిటీ శాఖ మంత్రి నిత్యానందో గోండో సూచించారు. శనివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్ శక్తి హాల్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా నదులు, కాలువలు దెబ్బతిన్న గట్లు ముందస్తుగా గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. వరదలు రావడానికి ముందే జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన అనుమానిత ప్రాంతాల్లో మందులు, మిల్క్ పౌడర్, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, బెల్లం, అటుకులు సిద్ధం చేయాలని సూచించారు. గర్భిణులను గ్రామాల్లో గుర్తించి కాన్పు సమయానికి ముందే ఆస్పత్రులకు చేర్చాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్, అగ్నిమాపక బృందాలకు అవసరమైన సామగ్రి ముందే సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎమ్మెల్యేలు మనోహర్ రంధారి, గౌరీ శంకర్ మజ్జి, మున్సిపల్ చైర్మన్ కునునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్లు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న చైన్ స్నాచర్లు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం పోలీసులు ఇద్దరు చైన్ స్నాచర్లను అరెస్టు చేశారు. శనివారం జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉమరాహండి గ్రామానికి చెందిన చంచల మజ్జి అనే మహిళ పపడాహండిలో ప్రతిరోజూ కూరగాయలు విక్రయించి తిరిగి ఇంటికి వస్తుంది. ఆమెను గత కొంతకాలంగా జొరిగాం సమితి పత్రాసిల్ గ్రామానికి చెందిన పరశురాం శాంత, ముండాగుడ గ్రామానికి చెందిన రాకేష్ శాంతలు అనుసరిస్తున్నారు. ఇటీవల బాధిత మహిళ కన్యాశ్రమం వద్ద బస్సు దిగి తన గ్రామానికి వెళ్తుండగా వీరిద్దరూ ముఖానికి ముసుగులు వేసుకొని వచ్చారు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసుని లాక్కొనిపోయారు. దీంతో బాధితురాలు చంచల డాబుగాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు బంగారు గొలుసుని ఉమ్మర్‌కోట్‌లో విక్రయించి ఆ డబ్బులతో డాబుగాంలో విలాసవంతమైన వస్తువులు కొనుగోలు చేశారు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు నిలదీయడంతో నేరం ఒప్పుకున్నారు. నిందితుల నుంచి నగదు, నంబర్ ప్లేట్‌లేని బైక్ స్వాధీనం చేసుకున్నారు.

లైంగిక వేధింపులపై ప్రజల ఆగ్రహం



లమ్తాపుట్‌లో ఆందోళన చేస్తున్న ప్రజలు



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు



స్కూల్‌లో దర్యాప్తు చేసి బయటకు వస్తున్న అధికారులు

కొరాపుట్: విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి ప్రజలు ఆందోళనకు దిగారు. కొరాపుట్ జిల్లా నందపూర్ పోలీసు సబ్ డివిజన్ లమ్తాపుట్ సమితిలోని ప్రభుత్వ బాలికల సంక్షేమ స్కూల్‌లో ఏప్రిల్ 13వ తేదీన 8 ఏళ్ల విద్యార్థినిపై లైంగిక దాడి జరిగింది. ఈ విషయం పాఠశాల సిబ్బంది రహస్యంగా ఉంచి బాలికకు చికిత్స చేయించారు. కానీ ఆమె పరిస్థితి మెరుగు పడలేదు. దీంతో గత్యంతరం లేక ఏప్రిల్ 30వ తేదీన గుణయిపాడలోని బాలిక ఇంట్లో దింపి వెళ్లిపోయారు. బాలిక ఆరోగ్యం బాగోలేకపోవడంతో కుటుంబీకులు వైద్యం కోసం తీసుకొని వెళ్లగా విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే కొరాపుట్ జిల్లా ఎస్పీ రోహిత్ వర్మకు విషయం తెలియజేయడంతో దర్యాప్తునకు ఆదేశించారు. లమ్తాపుట్ సమితి కేంద్రంలో ఈ ఘటనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మూకుమ్మడిగా ఇళ్ల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీగా బయటకు వచ్చారు. ఆగ్రహంతో పోలీసుస్టేషన్ వద్దకు వెళ్లి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌డీపీవో దేవేంద్ర మాలిక్ స్పందించి కేసు దర్యాప్తు జరుగుతోందని తెలియజేశారు. సున్నితమైన కేసు కావడంతో వివరాలు ప్రకటించలేమన్నారు. మరోవైపు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నారు.

చాందీపూర్, తలసరి బీచ్‌లకు మహర్దశ

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా కోస్తా ప్రాంతాల పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యాటక శాఖ మంత్రి ప్రభాతి పరిడా బాలాసోర్ జిల్లాలో పలు పర్యాటక ఆకర్షణీయ ప్రాంతాల్లో అనుకూల వనరులపై వైమానిక సర్వే నిర్వహించారు. జిల్లాలో తాలాసారా, చాందీపూర్ రెండు ప్రధాన సాగర తీరాలు. విశేష సంఖ్యలో పర్యాటకుల్ని ఈ తీరాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రాంతాల్లో చక్కటి పర్యావరణ పురోగతితో సందర్శకులకు అనుకూలమైన వసతి, మనోరంజక, కాలక్షేప వసతులు సమకూర్చితే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా వెలుగొందుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

బాలాసోర్ జిల్లాలో బీచ్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ రెండు ప్రధాన బీచ్‌లు తాలాసార, చాందీపూర్ ప్రధాన పర్యాటక కేంద్రాలుగా మలిచే లక్ష్యంతో గణనీయమైన ఆర్థిక కేటాయింపులు, పర్యాటక కార్యక్రమాలను మంత్రి ప్రతిభా పరిడా ప్రకటించారు. ఆసియాలోనే అతి పెద్ద శివలింగానికి నిలయమైన భుషండేశ్వర్ పీఠం ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను పెంచడానికి రూ.10 కోట్ల గ్రాంట్ ప్రకటించారు.



ఉప ముఖ్యమంత్రి వైమానిక సర్వే

సాగర తీరాలకు రూ. 11 కోట్లు

పర్యాటకులకు అనుకూలమైన ప్రసిద్ధ తీరప్రాంత గమ్యస్థానమైన చాందీపూర్ బీచ్ సమగ్ర అభివృద్ధికి మంత్రి రూ. 11 కోట్లు కేటాయించారు. ప్రతిష్టాత్మక బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందడం లక్ష్యంగా పేర్కొన్నారు. పర్యావరణ పర్యాటక రంగానికి ప్రోత్సాహకంగా, ఈ సంవత్సరం బాలసోర్ తీర ప్రాంతంలో ఎకో రిట్రీట్‌ను ఏర్పాటు చేయాలనే ప్రణాళికలను ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. సుస్థిర, ప్రకృతి కేంద్రీకృత అనుభవాలను కోరుకునే పర్యాటకులను ఆకర్షించడం ఈ చొరవ లక్ష్యం. జిల్లాలోని వివిధ బీచ్‌లలో మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు పురోగతి దశలో ఉన్నాయి. ఈ తీరాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, అధిక సంఖ్యలో సందర్శకులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని మంత్రి అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా బీచ్‌ల ప్రస్తుత స్థితిని అంచనా వేయడానికి మంత్రి హెలికాప్టర్ ద్వారా వైమానిక సర్వే నిర్వహించారు. అనంతరం ఆమె పర్యాటక శాఖ కమిషనర్ కమ్ సెక్రటరీ బల్వంత్ సింగ్‌తో పాటు స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలతో చర్చలు జరిపారు. ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధిని వేగవంతం చేయడంపై ప్రాధాన్యత పెంపొందించారు. సాగర తీరాల బహుముఖ అభివృద్ధి పర్యాటక రంగం బహుముఖ అభివృద్ధితో సమాజంలో సన్నకారు, బలహీన తదితర వర్గాలకు అనేక ఉపాధి అవకాశాల్ని అందుబాటులోకి తెస్తాయని మంత్రి తెలిపారు.

రాజాధిరాజు



రాజాధి రాజా అలంకరణలో మదన మోహనుడు

భువనేశ్వర్: శ్రీ క్షేత్రంలో శ్రీ జగన్నాథుని చందన యాత్ర అంగరంగ వైభవంగా సాగుతోంది. వెలుపలి చందన యాత్రలో భాగంగా శనివారం శ్రీ జగన్నాథుని ప్రతినిధి మదన మోహనుడు రాజాధిరాజా అలంకరణలో పల్లకిలో ఊరేగి నరేంద్ర సరోవరం తీరానికి చేరాడు. సరోవరంలో ఉభయ దేవేరులతో కలిసి నావికా విహారంలో పాల్గొని భక్తుల్ని ఉత్సాహపరిచాడు. స్వామి ఆగమనంతో నరేంద్ర సరోవరం సరికొత్త శోభతో కళకళలాడింది.

వైభవ వెంకటేశుని వార్షికోత్సవం



స్వామి సన్నిధిలో ప్రత్యేక కలశ అభిషేక పూజ

భువనేశ్వర్: జాజ్‌పూర్ ప్రాంతం ఉత్తరాది మఠం సముదాయంలో నెలకొన్న శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరాధ్య దైవం వైభవ వెంకటేశుని సహితంగా నిత్య పూజలు అందుకుంటున్న అలివేలు మంగమ్మ, గోదాదేవి, గరుడ స్వామికి ప్రత్యేక కలశ అభిషేకం నిర్వహించారు.

భువనేశ్వర్ న్యూ రైల్వే స్టేషన్ నుంచి రైళ్ల రవాణా

భువనేశ్వర్: భువనేశ్వర్ న్యూ రైల్వే స్టేషన్ (బీబీఎస్‌ఎన్) నుంచి రైళ్ల రవాణా ఖరారైంది. ఈ నెల 11 నుంచి మూడు ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు చేయనున్నాయి. తూర్పు కోస్తా రైల్వే ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వులు ప్రకారం, ముంబై, భువనేశ్వర్ మధ్య రాకపోకలు చేస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్, భువనేశ్వర్ మధ్య రవాణా అవుతున్న విశాఖ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం, భువనేశ్వర్ మధ్య నడుస్తున్న సూపర్ ఫాస్ట్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు తొలి విడత కింద బీబీఎస్‌ఎన్ నుంచి రాకపోకలు చేస్తాయి. దీని వల్ల ఉత్తర భువనేశ్వర్, అఠాగొడా, కటక్ ప్రాంతీయులకు రైలు ప్రయాణం సులభతరం అవుతుంది. మరో వైపు నగరంలోని ప్రధాన రైల్వే స్టేషనులో రద్దీ తగ్గుతుంది. భారతీయ రైల్వేల అమృత్ భారత్ పథకంలో భాగంగా విస్తరించిన పార్కింగ్, ఆధునిక నిరీక్షణ ప్రాంగణాలు, మెరుగైన లైటింగ్, ఇతరేతర అధునాతన ప్రయాణికుల సౌకర్యాలు ఈ స్టేషన్‌లో కల్పించారు.

భువనేశ్వర్ న్యూ రైల్వే స్టేషన్ (బీబీఎస్ఎన్) రైళ్ల రాకపోకల వేళలు		
ముంబై, భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్		
11019		11020
రాక / పోక	స్టేషను	రాక / పోక
-- / 14.00	సీఎస్ఎంటీ ముంబై	04.15 /--
23.35 / 23.55	భువనేశ్వర్	15.00 / 15.20
00.02 / 00.04	మంచేశ్వర్	14.48 / 14.50
00.20 / --	భువనేశ్వర్ న్యూ	-- / 14.40
సికింద్రాబాద్, భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్		
17016		17015
రాక / పోక	స్టేషను	రాక / పోక
-- / 16.50	సికింద్రాబాద్	07.30 / --
15.40 / 16.00	భువనేశ్వర్	08.20 / 08.40
16.04 / 16.06	మంచేశ్వర్	08.08 / 08.10
16.25 / --	భువనేశ్వర్ న్యూ	-- / 08.00
విశాఖపట్నం, భువనేశ్వర్ సూపర్ ఫాస్టు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్		
22820		22819
రాక / పోక	స్టేషను	రాక / పోక
-- / 16.20	విశాఖపట్నం	15.30 / --
23.55 / 00.15	భువనేశ్వర్	07.25 / 07.45
00.20 / 00.22	మంచేశ్వర్	08.08 / 08.10
00.35 / --	భువనేశ్వర్ న్యూ	-- / 07.15

క్లుప్తంగా

అన్నదమ్ములకు 560 మార్కులు



స్వీట్స్ తినిపిస్తున్న తండ్రి మోహన్ లెంక

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎం.వి.79 పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అన్నదమ్ములు డానీ ఎల్.లెంక, డోంబుర్ లెంకకు శనివారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకు 560 మార్కులు వచ్చాయి. అన్నదమ్ములను ఉపాధ్యాయులు అభినందించారు. కుమారుల విజయం పట్ల తండ్రి మోహన్ లెంక ఆనందం వ్యక్తం చేశారు.

టీచర్లకు ఆర్జిత సెలవులు మంజూరుచేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇటీవల వెలువడిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వేసవి సెలవుల్లో సైతం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా పనిచేస్తున్న నేపథ్యంలో వారందరికీ ఆర్జిత సెలవులు మంజూరుచేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.రవి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 వరకు పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. విద్యార్థుల మానసిక స్థితి, మండే ఎండలు, మరోవైపు ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విద్యాశాఖ మార్గదర్శకాలు ప్రతిబంధకంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లావ్యాప్తంగా నాటుసారా స్థావరాలెక్కడ ఉన్నా విస్తృతంగా దాడులు జరిపి అరికట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి జిల్లాలో గల స్టేషన్ ఆఫీసర్స్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లతో 80 అడుగుల రోడ్డు సమీప ఎక్సైజ్ కార్యాలయంలో డీసీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 110 సారా గుర్తింపు గ్రామాలను సారా రహిత గ్రామాలుగా మార్చాలన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 212 ఐడీ కేసులు నమోదై 162 మందిని అరెస్టు చేసి 2231 లీటర్ల సారా, ఏడు వాహనాలను స్వాధీనపర్చుకున్నామన్నారు. 6735 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. అక్రమంగా మద్యం విక్రయించేవారిపై 874 కేసులు నమోదు చేసి అంతేమందిని అరెస్టు చేశామని తెలిపారు. సమావేశంలో సంబంధిత శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా అధికారి తిరుపతినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ అవార్డుకు ప్రాజెక్టు ఎంపిక



గణిత అవధాని మద్దు తిరుపతిరావు

కంచిలి: మండలంలోని చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గణిత అవధాని మద్దు తిరుపతిరావు రూపొందించిన గణిత ప్రాజెక్టు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎన్‌సీఈఆర్‌టీ) వారు నిర్వహించిన అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు ఆయనకు ఎన్‌సీఈఆర్‌టీ నుంచి సమాచారం వచ్చిందని ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ వారు జనవరి 13న జాతీయ గణిత విద్యా సమావేశాల నిర్వహణ సందర్భంగా దేశవ్యాప్తంగా గణిత ప్రాజెక్టులను ఆహ్వానించారు. అందులో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు 'గణిత ప్రాథమిక కార్యకలాపాల సన్నాహక దశలో విద్యార్థుల పనితీరు అంచనా వేయటానికి బోర్డు గేమ్ ప్రయోగం' అనే ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దేశవ్యాప్తంగా 105 ప్రాజెక్టులను ఎంపిక చేయగా.. అందులో మన రాష్ట్రం నుంచి 4 మాత్రమే ఉన్నాయి. అందులో తిరుపతిరావు ప్రాజెక్టు చోటు సంపాదించుకోవడం విశేషం.

శ్రామికులే దేశానికి వెన్నెముక

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రామికులే దేశానికి వెన్నెముక అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు అవసరమైన చట్టాలు, ప్రభుత్వ పథకాలపై వివరించి, న్యాయ సహాయం అందించాల్సిన విధానాలను తెలియజేశారు. కార్మికులు తమ చెమటతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన అన్నారు. 1886 మే 1న అమెరికాలో ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు చేపట్టిన ఉద్యమాన్ని, షికాగోలో హే మార్కెట్ కాల్పులను గుర్తుచేశారు. ఈ చరిత్రను యువతకి తెలియజేసి కార్మికుల హక్కులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, డిప్యూటీ లేబర్ కమిషనర్ కె.అజయ్ కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

జీడిపప్పు, పైనాపిల్ ఎగుమతి చేయండి

• జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న కమల్‌జిత్ దాస్



కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జాయింట్ డైరెక్టర్ కమల్‌జిత్ దాస్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, అతిథులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో అత్యధికంగా ఉత్పాదన అవుతున్న జీడిపప్పు, పైనాపిల్, మిరియాలు, రబ్బరు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తే మైక్రో, చిన్న, మీడియం పరిశ్రమలదారులకు అధికంగా లాభాలు వస్తాయని జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. కలెక్టరేట్ వద్ద ఆర్‌శెటి భవనంలో జిల్లా స్థాయి జీడిపప్పు వెండర్ మొబిలైజేషన్ డ్రైవ్ కర్మశాలను శనివారం ప్రారంభించారు. ఈ వర్క్‌షాపు డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్, మార్కెటింగ్ (ఒడిశా) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇతర అతిథులుగా ఎం.ఎస్.ఎం.ఈ జాయింట్ డైరెక్టర్ కమల్‌జిత్ దాస్, ఎగుమతి ప్రమోషన్ డైరెక్టర్ అశోక్ కుమార్ బెహరా, చీఫ్ ఎక్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ ఫెడరేషన్ కమలకాంత సాహు, ఇకో బ్యాంకు సాధారణ పర్యవేక్షకుడు నితీష్ మహంతి, సీఈఓ సంజయ్‌కుమార్ ప్రధాన్, జిల్లా పరిశ్రమల శాఖ జి.ఎం సునారాం సింగ్ తదితరులు పాల్గొన్నారు. గజపతి జిల్లాలో 60కి పైగా జీడిపప్పు ఫ్యాక్టరీలు ఉన్నాయని, ఏ ఒక్క పారిశ్రామిక వేత్త ఎగుమతి చేయడం లేదని ఎం.ఎస్. ఎం.ఈ జాయింట్ డైరెక్టర్ కమల్‌జిత్ దాస్ అన్నారు. భారత్ ఏడాదికి సుమారు రూ.1.20 లక్షల కోట్ల ఎగుమతులు చేస్తుందని, అందులో ఒడిశా రూ.440 కోట్ల ఎగుమతి చేసి 7వ స్థానంలో ఉందన్నారు. దేశంలో ఒడిశా ఎగుమతుల్లో ఐదో స్థానంలో నిలబెట్టుకోవడానికి పారిశ్రామికవేత్తలు అడుగులు ముందుకువేయాలన్నారు. పారిశ్రామిక వేత్తలకు పారాదీప్ ధమ్రా పోర్టు, భువనేశ్వర్ నుంచి దుబాయ్, సింగపూర్, బ్యాంకాక్‌కు కార్గో ఎయిర్ ఫ్లైట్ నడుస్తుందని డైరెక్టర్, ఎక్స్‌పోర్టు ప్రమోషన్ అశోక్ కుమార్ బెహరా అన్నారు. పారిశ్రామిక వేత్తలకు ఎగుమతి చేయడానికి అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని ఇకో బ్యాంకు పర్యవేక్షకుడు నితీష్ మహంతి అన్నారు. ఈ సందర్భంగా 'ఒడిషా ఎక్స్‌పోర్టు సక్సస్' అనే బ్రోచర్‌ను అతిథులు విడుదల చేశారు. కలెక్టర్ బిజయ కుమార్ దాస్‌కు జ్ఞాపికతో సత్కరించారు. జిల్లాలో వివిధ పారిశ్రామిక వేత్తలు పాల్గొని వస్తు ఎగుమతిపై తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ వర్క్‌షాపు భువనేశ్వర్ డైరెక్టరేట్, ఎగుమతి, మార్కెటింగ్ ప్రమోషన్‌శాఖ ఆధ్వర్యంలో జరిగింది.



మాట్లాడుతున్న ఎక్స్‌పోర్టు ప్రమోషన్ డైరెక్టర్ అశోక్‌కుమార్ బెహరా

పూరీ స్వర్గద్వార్‌లో కేఐఐటీ విద్యార్థిని అంత్యక్రియలు

భువనేశ్వర్: కేఐఐటీ విశ్వవిద్యాలయంలో మృతి చెందిన నేపాలీ విద్యార్థిని ప్రిషా సాహా అంత్యక్రియలు పూరి స్వర్గద్వార్‌లో శనివారం నిర్వహించారు. కుటుంబీకుల అభీష్టం మేరకు ఈ చర్య చేపట్టారు. ఈ సంఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. గురువారం కేఐఐటీ విశ్వవిద్యాలయంలోని తన హాస్టల్ గదిలో 18 ఏళ్ల నేపాలీ విద్యార్థిని ప్రిషా సాహా మృతి అనుమానాస్పదంగా మారింది. ఆమె మరణానికి దారితీసిన పరిస్థితులపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారిక పర్యవేక్షణలో పంచనామా

మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్ష కోసం ఎయిమ్స్ భువనేశ్వర్‌కు తరలించారు. ఈ ప్రక్రియను ముగ్గురు సభ్యుల వైద్య బృందం గట్టి భద్రత మధ్య ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్, కమిషనరేట్ పోలీసు అధికారుల సమక్షంలో నిర్వహించారు. శవ పరీక్ష కోసం ఫోరెన్సిక్ బృందం కూడా ఉంది. దీన్ని పారదర్శకత కోసం వీడియోలో చిత్రీకరించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించినట్లు భువనేశ్వర్, కటక్ జంట నగరాల కమిషనరేట్ పోలీస్ అదనపు డీసీపీ ప్రకాష్ పాల్ తెలిపారు.

చివరి సంభాషణ కీలకం

ప్రిషా సాహా మరణించిన రోజు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడింది. ఆ సమయంలో ఆమె సాధారణంగానే ఉందని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. కొన్ని గంటల తర్వాత వారి కుమార్తె ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని వారికి సమాచారం అందింది. ఈ సంఘటన అకస్మాత్తుగా జరగడం ఆ కుటుంబాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని వాపోయారు. ఆమెలో ఎలాంటి బాధ కనిపించలేదని వారు చెబుతున్నారు.

పరికరాలు స్వాధీనం

కమిషనరేట్ పోలీసులు ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్నారు. ప్రిష సాహా రూమ్‌మేట్స్, సమీపంలోని హాస్టల్ మేట్స్‌తో సహా పది మందిని ప్రశ్నించారు. పోలీసులు ఆమె మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్, ఇతర వ్యక్తిగత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపారు.

3 నెలల్లో రెండో విషాదం

ప్రిషా సాహా అనుమానస్పద మరణం కేఐఐటీ క్యాంపస్‌లో వరుసగా రెండవ సంఘటన. ఈ ఏడాది ఫిబ్రవరి 16న ఈ క్యాంపస్‌లో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న ప్రకృతి లామ్సాల్ కూడా అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది.

వంతెన నిర్మాణంలో క్రేన్ కూలి ముగ్గురు మృతి

• ఇద్దరి పరిస్థితి విషమం



ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: కటక్ ఖాన్ నగర్ ప్రాంతం రింగ్ రోడ్ వంతెన నిర్మాణంలో క్రేన్ కూలిపోవడంతో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా మరో కార్మికుడు చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. ఈ దుర్ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా కొనసాగుతోంది.

కటక్ ఖాన్ నగర్ ప్రాంతంలోని ఒక వంతెన వద్ద శనివారం పనులు జరుగుతుండగా నిర్మాణ పనులకు ఉపయోగించిన క్రేన్ కూలిపోయిన ప్రమాదం జరిగింది. దీంతో కొన్ని స్లాబ్‌లు కుప్పకూలాయి. కఠొజొడి నదిపై వంతెన పనులు జరుగుతుండగా కొన్ని భారీ కాంక్రీట్ స్లాబ్‌లను ఎత్తుతున్న క్రేన్ ప్రమాదవశాదకదే కూలిపోయింది. క్రేన్ కింద పని చేస్తున్న కార్మికులు స్లాబ్‌ల కింద నలిగిపోయారు. క్షతగాత్రులను కటక్ ఎస్సీబీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి చేర్చారు.

ముఖ్యమంత్రి సంతాపం

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబీకులకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ఉచిత చికిత్స, వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు వెచ్చిస్తారని పేర్కొన్నారు.

మోసగించిన కేసులో నలుగురు మహిళల అరెస్టు



అరెస్టయిన మహిళలు

రాయగడ: బంగారు ఆభరణాలకు మెరుగుపెడతామని చెప్పి మోసగించి బంగారు ఆభరణాలను అపహరించిన కేసులో కాశీపూర్ పోలీసులు నలుగురు మహిళలను శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కటిని గిరి, మమిత గిరి, దుర్గా గిరి, విశ్వమణి గిరిలు ఉన్నారు. వీరి నుంచి పోలీసులు 34 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను శనివారం కోర్టుకు తరలించారు. కాశీపూర్ సమితి లదాఖాన్ గ్రామంలో శుక్రవారం ఉదయం నలుగురు మహిళలు వెళ్లి బంగారు ఆభరణాలకు మెరుగుపడతామని నమ్మించారు. దీంతో గ్రామానికి చెందిన లావణ్య గౌడా అనే మహిళ తన వద్ద గల రెండు తులాల బంగారు హారాన్ని మెరుగు పెట్టేందుకు ఇచ్చింది. అనంతరం మెరుగుపెట్టినట్లు నటించిన ఆ నలుగురు మహిళలు కొద్ది సేపటి తర్వాత ఒక కవరులో ప్యాక్ చేసి మెరుగు పెట్టినందుకు గాను కొంత మొత్తం డబ్బులు తీసుకుని వెళ్లిపోయారు. వారు వెళ్లిన తర్వాత మెరుగు పెట్టేందుకు ఇచ్చిన ప్యాకెట్‌ను ఓపెన్ చేసి చూడగా అందులో ప్లాస్టిక్ హారం ఉండటంతో మోసపోయానని భావించిన గౌడా లబోదిబోమంటూ వెంటనే కాశీపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అదే రోజు సాయంత్రం ఆ నలుగురు మహిళలను పట్టుకుని అరెస్టు చేశారు.

ఇంద్రావతి నదీ తీరంలో అస్థి పంజరం



అస్థి పంజరాన్ని తరలిస్తున్న నబరంగ్‌పూర్ జిల్లా పోలీసులు



ఇసుకలో వెలుపలికి వచ్చిన అస్థి పంజరం అవశేషాలు

కొరాపుట్: ఇంద్రావతి నదీ తీరంలో గుర్తు తెలియని వ్యక్తి అస్థి పంజరం లభ్యమైంది. శనివారం నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి పోలీస్ స్టేషన్ పరిధిలో నందాహండి సమితి ఎకంబా–నువాగాం గ్రామాల మధ్య ప్రజలు స్నానానికి వెళ్లారు. అక్కడ ఇసుకలో అస్థి పంజరం కొంత బయటకు వచ్చి కనిపించింది. దీంతో స్థానిక సర్పంచ్ ద్వారా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి తవ్వకాలు ప్రారంభించగా అస్థి పంజరంతో పాటు మొబైల్ ఫోన్ కూడా దొరికింది. ఐఐసీ ప్రణవ్ తుడు, అదనపు తహసీల్దార్ పురుషోత్తమ బెనియా సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు. సైంటిఫిక్ టీం రంగంలోకి దిగింది. అనంతరం అస్థి పంజరాన్ని తరలించారు.

సమ్మర్ క్రికెట్ కోచింగ్‌కు వేళాయె..

● రేపటి నుంచి జిల్లాలో క్రికెట్ కోచింగ్ క్యాంప్‌లు మొదలు



శ్రీకాకుళం న్యూకాలనీ: సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపులకు రంగం సిద్ధమైంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సూచనల మేరకు జిల్లా క్రికెట్ సంఘం ఇందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 5వ తేదీ నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లకు నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 31వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణ శిబిరాల్లో క్రికెట్‌పై ఆసక్తి కలిగిన బాలబాలికలు ఎవరైనా హాజరుకావచ్చని జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు చెబుతున్నారు.

5 కేంద్రాల్లో శిక్షణ..

జిల్లాలో శ్రీకాకుళం జిల్లా కేంద్రం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాలతోపాటు కళింగపట్నం, నరసన్నపేట, టెక్కలి, ఇచ్ఛాపురం సబ్‌సెంటర్లలో ఈ సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతిరోజు ఉదయం 6 ఉదయం 8.30 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 నుంచి 6.30 వరకు సబ్ సెంటర్లలో నిష్ణాతులైన కోచ్‌లు శిక్షణను అందించనున్నారు. శిక్షణకు హాజరయ్యే చిన్నారులు, బాలబాలికలకు ఫిట్‌నెస్‌తోపాటు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ తదితర విభాగాల్లో తర్ఫీదును అందిస్తారు. తల్లిదండ్రులు వారి పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలని సబ్‌సెంటర్ల కోచ్‌లకు అందజేయాలని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు పీవైఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న క్రీడాకారులకు జూన్ ఒకటో తేదీన ఆయా సబ్‌సెంటర్లలో సర్టిఫికెట్లను అందజేయనున్నట్టు వారు వెల్లడించారు.

మీడియా స్వేచ్ఛపై ఆంక్షలు సరికాదు



కొరాపుట్: సమావేశంలో పాల్గొన్న పాత్రికేయ సంఘాల ప్రతినిధులు

కొరాపుట్: మీడియా స్వేచ్ఛపై ఆంక్షలు తగదని స్టేట్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ కొరాపుట్ జిల్లా విభాగ ప్రెసిడెంగ్ తరుణ్ కుమార్ మహాపాత్రో పేర్కొన్నారు. శనివారం జయపూర్ పట్టణంలోని నేషనల్ ఐబీలో జరిగిన ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవ సభలో ప్రసంగించారు. కాలానుగుణంగా మీడియాలో మార్పులు జరుగుతున్నాయన్నారు. ఎంత అభివృద్ధి జరిగినా మీడియాపై దాడులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు పవన్ పాణిగ్రాహి, సత్యనారాయణ పట్నాయక్, సన్న చౌదరి, శిశిర్ ఆచార్య, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి..


జయపురం: మీడియా ప్రతినిధులు నిర్భయంగా విధులు నిర్వహించగలిగిన నాడే పత్రికలకు మనుగడ ఉంటుందని పలువురు పాత్రికేయులు అన్నారు. శనివారం ప్రపంచ ప్రెస్ స్వేచ్ఛా దినం సందర్భంగా స్టేట్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఒడిశా, కొరాపుట్ జిల్లా శాఖ సమావేశం నిర్వహించింది. స్థానిక రోడ్లు, భవణ నిర్మాణ విభాగ అతిథి గృహంలో జిల్లా అధ్యక్షుడు తరుణ్ మహాపాత్రో అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు జర్నలిస్టులు మాట్లాడారు. సమాజంలో పాత్రికేయులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని కోరారు.

ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తాం..

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ పూజారిపుట్ వద్ద 19 గ్రామాల ప్రజలు సమావేశమయ్యారు. పల్లెసభ జరపకుండా మీనాక్షి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఈ విషయాన్ని కొరాపుట్ జిల్లా కలెక్టర్, జయపురం సబ్ కలెక్టర్‌లకు తెలియజేయగా.. ఈ విషయంలో పల్లెసభ నిర్వహించి ప్రజాభిప్రాయం తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. నేటికీ ప్రజాభిప్రాయ సమావేశం నిర్వహించకుండా నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. అధికారుల చర్యల పట్ల సమావేశం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇందుకు నిరసనగా రానున్న రోజుల్లో ప్రాజెక్టు వద్ద ధార్నా జరిపేందుకు సమావేశం నిర్ణయించింది. మీనాక్షి హైడ్రో ఎలక్ట్రికల్ ప్రైవేట్ కంపెనీ బొయిపరిగుడ సమితి తెంతులిగుమ్మ విద్యుత్ ప్రాజెక్టు నిర్మించి 25 మెగా వాట్లుల విద్యుత్ ఉత్పాదన చేస్తుందని, ప్రాజెక్టులో రెండో యూనిట్ కూడా పూర్తి చేసి మూడో యూనిట్ పనులు చేపట్టిందన్నారు. మొదటి ప్రాజెక్టుకు ప్రభుత్వ అనుమతి ఉండగా.. మూడో యూని ట్ అనుమతి లేకుండా పనులు చేపట్టినట్లు ఆరోపించారు. బదుడిపార, అటల్‌గుడ, మాలిపాదర్ గ్రామాలు నీట మునుగుతాయన్న భయం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే ముందు గ్రామసభ నిర్వహించలేదని ఆరోపించారు. అటవీ విభాగ అనుమతి కూడా తీసుకోలేదన్నారు. ఈ ప్రాంతం రామగిరి పంచాయతీ ధాందరఖాల్ రిజర్వ్ ఫారెస్టు కావటం వలన ఇక్కడ ఎలా ప్రాజెక్టు నిర్మాణం చేపడతారని సమావేశం ప్రశ్నించింది. అందువలన ప్రజల జీవనాధారం కోల్పోతారని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. అధికారులు సముచిత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది.



ఎక్కడో ఊరవతల ఓ మర్రి చెట్టు.. ఎండన పడి తిరిగే వారిని కాసేపు కూర్చోండర్రా.. అని పిలుస్తూ ఉంటుంది. ఊరి మధ్యన రావి చెట్టు.. ఎర్రటి ఎండకు ఆకులతో గొడుగు పట్టి తన ఒడిలో కూర్చున్న వారికి ప్రాణ వాయువు అందిస్తూ ఉంటుంది. ఇంటివెనుక జామ చెట్టు.. తీయటి ఫలాలు అందించడంతో పాటు సందె వేళ కింద కూర్చుకుంటే చల్లటి గాలిని కానుకగా ఇస్తుంది. అందుకే వేసవిలో చెట్టుతో జట్టు కట్టడం అత్యవసరం.



గంద్రేడులోని మర్రి చెట్టు కింద కూర్చున్న ప్రజలు

చెట్టు.. వేసవికి జట్టు

● పచ్చని చెట్లే వేసవి విడిదులు
● పల్లెటూళ్లలో వృక్షాల కిందనే సేద దీరుతున్న ప్రజలు



దల్లవలసలో చెట్టు నీడలో సేదతీరుతూ...



మజ్జిలిపేటలో మర్రి చెట్టు కింద కూర్చున్న ప్రజలు, పనులు చేసుకుంటున్న కూలీలు

పొందూరు:

పల్లెటూరు.. సందె వేళ.. మర్రి చెట్టు కింద మకాం.. కాసిన్ని కబుర్లు.. కావాల్సినంత చల్లని గాలి. అంతే వేసవి ఇట్టే గడిచిపోతుంది. చుట్టూ ఎండ తాండవం చేస్తున్నా చెట్టు నీడలో మాత్రం ఏసీ పెట్టినట్టే చల్లటి గాలి వీస్తుంది. అదే ఇప్పుడు పల్లెవాసులను రక్షిస్తోంది. పొందూరు మండలంలోని దళ్లవలస, కోటిపల్లి, మజ్జిలిపేట, గంద్రేడు, మలకాం, వీఆర్ గూడెం గ్రామాల్లో పెద్ద మర్రి చెట్లు వేసవి విడిదులుగా దర్శనమిస్తున్నాయి. ఈ చెట్లు సుమారు 60 ఏళ్ల నుంచి 200 ఏళ్ల వయస్సు ఉన్నవి. విశాలంగా వ్యాపించిన ఊడలతో నీడ అల్లుకుంటుంది. దీంతో ఎండకు దొరకకుండా పిల్లలు, పెద్దలు వాటి కిందనే సేద దీరుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో చెట్ల కిందకు వచ్చి ముచ్చటించుకునేవారు కొందరు, నిద్రపోయే వారు మరికొందరు, ఆడుకునే పిల్లలు, వలస కూలీలు అక్కడే ఉంటున్నారు.

ఎండ నుంచి ఉపశమనం



మాది మలకాం గ్రామం. చిన్న పల్లెటూరు. వేసవి కాలం వచ్చిందంటే గ్రామంలోని ప్రజలు ఈ మర్రి చెట్టుకిందకే కూర్చునేందుకు వస్తుంటారు. ఇక్కడే సేద దీరుతుంటారు. మర్రిచెట్టు వయస్సు సుమారు 200 ఏళ్లు ఉంటుంది. బయట నుంచి వచ్చేవారంతా కచ్చితంగా ఇక్కడ కూర్చొని ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు.

– జాడ అసిరినాయుడు, మలకాం, పొందూరు మండలం

విశాలమైన ప్రాంగణం



మాది గంద్రేడు. శివారు గ్రామం. నాగావళి నది ఒడ్డున ఉంది. నది నుంచి వచ్చే చల్లని గాలి మర్రిచెట్టు కిందకు వచ్చి మరింత కూల్‌గా మారిపోతుంది. దీంతో పెద్దలు ఇక్కడే నిద్రపోయేందుకు, సేద దీరేందుకు వస్తుంటారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు అనువుగా చెట్టు నీడ ఉంది. ఈ చెట్టు మా గ్రామానికి వరం.

– చింతాడ సూర్యారావు, గంద్రేడు, పొందూరు మండలం



మలకాంలోని మర్రిచెట్టు కింద కూర్చున్న ప్రజలు

క్లుప్తంగా

రీసర్వే పక్కాగా నిర్వహించాలి : ఆర్డీవో



హాజరైన ఎనిమిది మండలాల వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు తదితరులు (ఇన్‌సెట్‌లో) వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యవాణి

చీపురుపల్లి: భూములు రీసర్వే ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆర్డీవో జివి.సత్యవాణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఎనిమిది మండలాల్లో పని చేస్తున్న తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వో, విలేజ్ సర్వేయర్లకు రీసర్వే కార్యక్రమంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ రీసర్వే నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ప్రతీ అంశాన్ని అవగాహన చేసుకోవాలన్నారు. వర్క్‌షాప్‌లో నిర్దేశించిన విధంగా గ్రామాల్లో రీసర్వే నిర్వహించాలన్నారు. ప్రధానంగా వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు రీసర్వేపై పూర్తి అవగాహన కల్పించుకోవాలన్నారు. రీసర్వేకు సంబంధించి ఇప్పటికే మండలాల్లో ఉన్న డిప్యూటీ తహసీల్దార్లు వారిని సమన్వయం చేసుకోవాలన్నారు.

జూన్ నుంచి మొక్కల పంపిణీ

- డీఎఫ్ఓ కొండలరావు



వనమిత్ర కేంద్రంలో మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ కొండలరావు

బొండపల్లి: వనమిత్ర కేంద్రాలతో పాటు, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీల్లో జూన్ నుంచి మొక్కల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు డీఎఫ్ఓ ఆర్. కొండలరావు తెలిపారు. స్థానిక వనమిత్ర కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. కేంద్రంలో ఏయే రకాల మొక్కల పెంపకం చేపడుతున్నారో అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాదం, కానుగ, వేప, తదితర మొక్కలు ఉచితంగా కావాల్సిన చిన్న, సన్నకారు రైతులు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, భూమి పాసు పుస్తకాల జెరాక్స్‌లతో దరఖాస్తులను నర్సరీ అధికారులకు అందజేయాలని సూచించారు. అలాగే ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు, పెద్ద రైతులు తమకు కావాల్సిన మొక్కల వివరాలను సమర్పిస్తే తక్కువ ధరకు మొక్కలు అందిస్తామని చెప్పారు. వనమిత్ర కేంద్రాల అభివృద్ధికి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎఫ్ఆర్ఓ ఎల్.సింధూ, ఫారెస్టు రేంజ్ అధికారి బి.అప్పలరాజు ,వనమిత్ర కేంద్రం సహాయకుడు పి.అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

అపస్మారక స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి



రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం కనకమహాలక్ష్మి కాలనీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడిఉండడాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. ఈ విషయాన్ని రాజాం పోలీసులకు తెలియజేయడంతో సంబంధిత ప్రాంతానికి చేరుకున్నారు. వెంటనే రాజాం ప్రాంతీయ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి సుమారు 60 ఏళ్ల వయసు ఉంటుందని, పచ్చ, నలుపు చారలతో టీ షర్ట్ ధరించాడని పోలీసులు తెలిపారు. ఎవరైనా సంబంధిత బంధువులు గుర్తిస్తే రాజాం పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

కాశీలో బొద్దూరు వాసి మృతి

సంతకవిటి: మండలంలోని బొద్దూరుకు చెందిన గేదెల దామోదరరావు(55) గుండెపోటుతో కాశీలో శుక్రవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనానికి కాశీకి వెళ్లిన ఆయన గురువారం తిరుగుపయనమయ్యారు. రైలు మరికొద్దిసేపట్లో ప్రారంభమవుతుందనగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు. రైలు దిగి అక్కడి ఆస్పత్రిలో చేర్పించారు. అయితే అక్కడే చికిత్స పొందుతూ మరణించారు. సాయంత్రం కాశీలోనే దహన సంస్కారాలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్క్

విజయనగరం: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, అర్బన్ ప్రాంతాలను ఎంపిక చేసి నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్‌ల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో శనివారం మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే రాజధాని నిర్మాణాలను పునఃప్రారంభించినట్టు వెల్లడించారు. 58 వేల కోట్ల రూపాయలతో కూడిన విజన్ ప్రణాళికను ప్రధాని మోదీ ఆవిష్కరించడం శుభపరిణామం అన్నారు.

సేవల్లో వెనుకబడిన..
ఏపీవీపీ ఆసుపత్రులు..!

- జీ గ్రేడ్‌లో ఆరు ఆసుపత్రులు
- సీ గ్రేడ్‌లో చీపురుపల్లి ఆసుపత్రి
- ఓపీ, ఐపీ సేవల్లోనూ వెనుకబాటే..
- జిల్లాలో ఏడు ఏపీవీపీ ఆసుపత్రులు
- అన్ని ఆసుపత్రుల్లో తగ్గిన సేవలు
- డెప్యూటేషన్‌పై కాలయాపన చేస్తున్న కొందరు వైద్యులు



భోగాపురం సీహెచ్‌సీ

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్ ఆసుపత్రులు సేవల్లో వెనుకబడ్డాయి. ప్రభుత్వం ప్రతీ నెల ప్రకటించే గ్రేడ్‌ల్లో ఈ విషయం తేటతెల్లమైంది. అన్ని ఆసుపత్రుల్లోనూ సేవలు తగ్గాయి. కూటమి ప్రభుత్వం వైద్య శాఖను పట్టించుకోకపోవడం వల్ల ఆసుపత్రులు గాడి తప్పాయని విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది వైద్య సిబ్బంది డెప్యూటేషన్ల పేరుతో కాలయాపన చేయడం వల్ల కూడా సంబంధిత ఆసుపత్రుల్లో సేవలు పూర్తి స్థాయిలో అందకపోవడం వల్ల సేవల్లో వెనుకంజలో ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఓపీ, ఐపీ సేవల్లో కూడా ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. జిల్లాలో వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రులు ఏడు ఉన్నాయి. వాటిలో ఎస్.కోట ఏరియా ఆసుపత్రి, గజపతినగరం ఏరియా ఆసుపత్రి, బాడంగి, బొబ్బిలి, చీపురుపల్లి, భోగాపురం, నెల్లిమర్ల సీహెచ్‌సీలు ఉన్నాయి.

బీ గ్రేడ్‌లో ఆరు ఆసుపత్రులు

2025 మార్చి నెలలో ప్రభుత్వం ఆసుపత్రులకు గ్రేడ్‌లను ప్రకటించింది. ఆసుపత్రులు అందించే సేవలు ఆధారంగా ఏ, బీ, సీ గ్రేడ్‌లు ప్రకటిస్తారు. జిల్లాలో ఆరు ఆసుపత్రులకు బీ గ్రేడ్ ఇవ్వగా, ఒక ఆసుపత్రికి సీ గ్రేడ్ ఇచ్చారు. చీపురుపల్లి ఆసుపత్రికి సీ గ్రేడ్ ఇవ్వగా.. ఎస్.కోట, గజపతినగరం, భోగాపురం, నెల్లిమర్ల, భోగాపురం, బొబ్బిలి ఆసుపత్రులకు బీ గ్రేడ్ ఇచ్చారు.

మార్చి 2025లో ఏపీవీపీ ఆసుపత్రులు అందించిన ఓపీ సేవలు

ఆసుపత్రి పేరు	ఓపీ లక్ష్యం	సాధించింది
ఎస్.కోట	18,000	10,000
గజపతినగరం	18,000	10,000
చీపురుపల్లి	18,000	6,000
బాడంగి	13,000	7,500
నెల్లిమర్ల	7,000	3,400
బొబ్బిలి	13,000	7,800
భోగాపురం	7,200	4,600

ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీల్లో అందించే సేవలు

ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీల్లో గైనిక్, పిడియాట్రిక్, ఎముకలు, కంటి, దంత, జనరల్ సర్జరీ తదితర విభాగాలకు చెందిన రోగులను పరీక్షించి ఓపీ సేవలు అవసరమైన ఓపీ సేవలు అందిస్తారు. ఇన్‌పేషెంట్ సేవలు అవసరమైన ఇన్‌పేషెంట్‌గా ఆస్పత్రిలో చేర్పించి సేవలు అందిస్తారు. అదే విధంగా గర్భిణులకు వైద్య తనిఖీలతో పాటు ప్రసవాలు, సిజేరియన్లు చేస్తారు. రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు, ఈసీజీ, ఎక్సరే వంటి సేవలు అందిస్తారు.

డెప్యూటేషన్లతో కాలయాపన

వైద్య విధాన్ పరిషత్‌లోని కొంత మంది వైద్యులు డెప్యూటేషన్లపై కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యవిధాన పరిషత్‌కు సంబంధించి ఇద్దరు వైద్యులు డెప్యూటేషన్‌పై డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో పని చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఆయా ఆసుపత్రుల్లో సంబంధిత వైద్యులు అందించాల్సిన సేవలు రోగులకు పూర్తి స్థాయిలో అందడం లేదని రోగులు వాపోతున్నారు.

ఆసుపత్రి పేరు	ఐపీ లక్ష్యం	సాధించింది
ఎస్.కోట	1700	1540
గజపతినగరం	1700	615
చీపురపల్లి	1700	464
బాడంగి	1000	720
బొబ్బిలి	1000	504
భోగాపురం	600	393
నెల్లిమర్ల	600	171



గజపతినగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

మెరుగైన సేవల కోసం చర్యలు

వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆరు ఆసుపత్రులు బీ గ్రేడ్‌లో ఉన్నాయి. ఒక ఆసుపత్రి సీ గ్రేడ్‌లో ఉంది. అన్ని ఆసుపత్రులను ఏ గ్రేడ్‌లోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒకటి రెండు ఆసుపత్రుల్లో భవనాలు చాలక బెడ్స్ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేకపోతున్నాం. భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీహెచ్ఎస్ఐడీసీ అధికారులకు చెప్పాం.

– డాక్టర్ ఎస్.పి.పద్మశ్రీ రాణి, డీసీహెచ్ఎస్

ఆర్అండ్ఆర్ కాలనీలో పోలీసు పికెట్

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌పై దాడి నేపథ్యంలో గ్రామంలో పర్యటించిన సీఐ, ఎస్ఐ
- దాడులకు పాల్పడితే కఠిన చర్యలు



శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీలో పర్యటిస్తున్న సీఐ, ఎస్ఐ తదితరులు

వంగర: నాయకులు, వ్యక్తులపై దాడులకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు హెచ్చరించారు. ఈ నెల 2వ తేదీ రాత్రి వైఎస్సార్‌సీపీ వంగర మండల కన్వీనర్ కరణం సుదర్శనరావుపై దాడి కేసు నమోదైన నేపథ్యంలో ఎస్ఐ షేక్‌శంకర్‌తో కలిసి గ్రామంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. ప్రజలు కక్షపూరితంగా వ్యవహరించొద్దని, గుంపులుగా తిరగవద్దని, అవాంఛనీయ ఘటనలకు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎటువంటి వివాదాలకు పాల్పడొద్దని, శాంతియుతంగా మెలగాలని సూచించారు. శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సుదర్శనరావుపై దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ శనపతి సత్యారావు, ప్రజలు పోలీసులను కోరారు.

నేడు నీట్ ప్రవేశ పరీక్ష

విజయనగరం అర్బన్: మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్–2025 పరీక్ష జిల్లాలోని ఐదు కేంద్రాల్లో ఆదివారం జరగనుంది. పట్టణంలోని జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో రెండు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండు, కేంద్రీయ విద్యాలయంలో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో 1,550 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

11వ తేదీ వరకు కలెక్టర్ సెలవు

- ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: కలెక్టర్ డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ ఆదివారం నుంచి 11వ తేదీ వరకు వ్యక్తిగత సెలవుపై వెళ్లనున్నారు. ఆయన తిరిగి ఈ నెల 12వ తేదీన జిల్లాకు రానున్నారు. ఈ కాలంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారని కలెక్టర్ కార్యాలయ వర్గాలు శనివారం ఓ ప్రకటనలో తెలిపాయి.

5న ఎస్టీ కమిషన్ చైర్మన్ గిరిజన వర్సిటీ సందర్శన

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఈ నెల 5న జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.45 గంటలకు తన క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి జెడ్పీ అతిథిగృహానికి చేరుకుంటారు. అక్కడ సందర్శకులను కలిసిన అనంతరం 10.15 గంటలకు బయలుదేరి కొండకరకాం పరిధిలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి వెళ్తారు. అక్కడి పరిపాలనా సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారు. అనంతరం 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మెంటాడ మండలం కుంటినవలస వద్ద నిర్మాణంలో ఉన్న గిరిజన వర్సిటీ పనులను పరిశీలిస్తారు. అధికారులు, సిబ్బందితో చర్చించిన అనంతరం అక్కడి నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి విజయనగరం జెడ్పీ అతిథి గృహానికి చేరుకుంటారు.

జానపద కళలను ఆదరించాలి



కళలను ఆదరించాలని కోరుతున్న బద్రి కూర్మారావు, వివిధ బృందాల గురువులు

విజయనగరం టౌన్: అంతరించిపోతున్న జానపద కళలను ఆదరించి కళాకారులకు ప్రదర్శనలు కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలని గిడుగు రామూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు కోరారు. కోట ప్రాంగణంలో ఉత్తరాంధ్ర నవచైతన్య నాట్య కళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కళాకారులు, కార్యవర్గ సమావేశం కార్యదర్శి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఇటీవల కాలంలో హైదరాబాద్, అరకు, భోపాల్ వంటి చోట్ల జిల్లా జముకులు, తూర్పు భాగవతం, చెక్కభజన కళాకారులకు అవకాశం రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాలు, దేవదాయ, ధర్మాదాయ శాఖ, సాంస్కృతిక శాఖ అంతరించిపోతున్న జానపద కళలను ఆదరించాలని కోరారు. ప్రజలు కూడా వీటిని ఆదరించి మన సంస్కృతిని కాపాడాలని కోరారు. 50 ఏళ్లు దాటిన కళాకారులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఉత్తరాంధ్రలోని అతివేగంగా అంతరించిపోనున్న తూర్పు భాగవతం, రుంజ వాయిద్యం, జముకుల పాట, తప్పెటగుళ్లు, బుడగ జంగాల పాటలు, దాసర్ల పాటలు, చెక్క భజనలు, సాముగరిడీలు, పులివేషాలు వంటి కళలను ఆదరించి భావితరాలకు అందించాలన్నారు. సమావేశంలో జిల్లాలోని జముకుల పాట, చెక్కభజన, సాము గరిడి తదితర బృంద గురువులైన అట్టాడ లక్ష్మీనాయుడు, మత్స తవిటినాయుడు, మక్కువ మారినాయుడు, సింహాచలం, మిరియాల జగన్, పోలిరాజు, పి.సురేష్, రెడ్డి శంకరరావు, తౌడు, యువ కళాకారులు పాల్గొన్నారు.

ఆధిపత్యం చెలాయిస్తున్నారు...!



విలేకరులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: కూటమి పార్టీకి చెందిన ఓ నాయకుడు తనపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని తెలిపారు. స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాలుగేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన ఒక నాయకుడు పాలనా విషయాల్లో తలదూర్చి తనను పూర్తిగా నియంత్రించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను జనసేన పార్టీలోకి మారిన తర్వాత కూటమి పార్టీకి చెందిన ఇంకో వ్యక్తి తనపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని చెప్పారు. కౌన్సిల్ సమావేశాల్లో ప్రవేశపెట్టే అంశాలను సభ్యుల సూచనల మేరకే తాను ఆమోదిస్తానని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. తాజాగా జరిగిన సమావేశంలో ప్రవేశపెట్టిన కల్యాణ మండపం విస్తరణ, పార్కు ప్రహరీ నిర్మాణం వంటి అంశాలను మెజారిటీ సభ్యులు వ్యతిరేకించడంతో తాను కూడా తిరస్కరించినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యులు కలిసి తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతారని ఇటీవల జోరుగా ప్రచారం జరుగుతోందని, కూటమి ప్రభుత్వంలోని తనపై కూటమిలోని వేరే పార్టీ ఎలా అవిశ్వాసం పెడుతుందని సరోజిని ప్రశ్నించారు. పలు విషయాల్లో కమిషనర్‌తో తాను కుమ్మక్కయ్యానన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. జనసేన పార్టీ నాయకులు అప్పికొండ రవికుమార్, రవ్వా నాని, పాండ్రంకి సత్యనారాయణ మాట్లాడుతూ చైర్‌పర్సన్‌కు సంబంధించి ఏవైనా లోపాలుంటే టీడీపీ నాయకులు, సభ్యులు జనసేన పార్టీ దృష్టికి తీసుకు రావాలని, అంతేగాని కౌన్సిల్ సమావేశాల్లో ఎలా ప్రస్తావిస్తారని ప్రశ్నించారు. అలాగే చైర్‌పర్సన్ పిలుపునిచ్చిన సమావేశానికి ఎలా గైర్హాజరు అవుతారని ప్రశ్నించారు. కాలువలపై అక్రమణలు తొలగించి పట్టణాన్ని అభివృద్ధి చేసే చర్యలను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. పట్టణాభివృద్ధికి అన్ని పార్టీల సభ్యులు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశాలతో కూటమి పార్టీలకు చెందిన నాయకులతో కలసి నడవాలని తాము భావిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు మజ్జి రాంబాబు, బంగారు భానుప్రకాష్, బంగారు శంకరరావు, పలిశెట్టి దొరబాబు, సారిపల్లి శంకరరావు, పళని తదితరులు పాల్గొన్నారు.

సంకిలి చక్కెర ఫ్యాక్టరీ మూతపడకుండా చూడాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం తదితరులు

బొబ్బిలి: సంకిలి చక్కెర ఫ్యాక్టరీని మూత వేసి బీర్ల కంపెనీ పెట్టే యోచనలో యాజమాన్యం ఉందని, ఆ దిశగా యాజమాన్యాన్ని వెళ్లనీయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం అన్నారు. బొబ్బిలిలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న లచ్చయ్యపేట, భీమసింగి చక్కెర పరిశ్రమలు మూతపడటంతో చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. చెరకును పండించేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికే సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు ఫ్యాక్టరీని మూత పడనీయకుండా చర్యలు తీసుకోకపోతే చెరకు రైతు కనుమరుగు కావడం ఖాయమన్నారు. జిల్లాలో విమానాశ్రయాలు, ఆయుధ బాండాగారాల వలన రైతులకు, ప్రజలకు వచ్చిన ప్రయోజనాలు లేవని, రైతు సంబంధ ప్రయోజనాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, రెడ్డి త్రినాధ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ బూట్ క్యాంప్‌ను సందర్శించిన డీఈవో



విద్యార్థులు డవలప్ చేసిన మోడల్స్ పరిశీలిస్తున్న డీఈవో మాణిక్యాలనాయుడు

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఏటీఎల్ సమ్మర్ బూట్ క్యాంప్‌ను డీఈవో యు.మాణిక్యాలనాయుడు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రెండు రోజులుగా విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. పేపర్‌ట్రోనిక్స్, రొబోటిక్స్‌పై విద్యార్థుల స్థాయిని పరిశీలించారు. విద్యార్థులు డవలప్ చేసిన కంప్యూటర్ గేమ్‌ను చూసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ చిన్నతనంలో ఆటోమేటిక్ కార్ల బొమ్మలు బజారులో కొనుక్కునే వారమని, ఇప్పుడు మీరే తయారు చేయటం ఆశ్చర్యం, అద్భుతం అన్నారు. ఇలాంటి వసతులు సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందని, వాటిని వాడుకోవాలన్నారు. సమ్మర్ బూట్ క్యాంప్‌లో కోడింగ్, ఆటోమేషన్, పేపర్‌ట్రోనిక్స్, పిక్టోబ్లాక్ నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఇప్పటివరకూ ల్యాబ్ సాధించిన విజయాలను జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, హెచ్.ఎం ఉమామహేశ్వరరావు, ల్యాబ్ ఇంచార్జ్ వి.రమేష్‌లు డీఈవోకు వివరించారు. 2019లో ప్రారంభమైన ల్యాబ్ జాతీయ స్థాయిలో హబ్ అటల్ ల్యాబ్‌గా గుర్తింపు సాధించిందన్నారు. రమేష్ మాట్లాడుతూ ఫ్రాన్స్‌కు చెందిన లా పొండేషన్ డస్సాల్‌సిస్టమ్స్ సహకారంతో యూరిన్ రెగ్యులేటరీ డివైస్, బనానాకాటన్ ప్రొడక్ట్స్ అభివృద్ధి చేశామని, సి.డి.పి.ఎం.డి ప్రొడక్ట్స్ పేటెంట్ కోసం రిజిస్టర్ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ కబడ్డీ జట్టు కోచ్‌గా చైతన్య



చైతన్య

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న ఖేలో ఇండియా కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్‌గా విజయనగరానికి చెందిన పాలూరి చైతన్య నియామకమయ్యారు. ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు బిహార్‌లోని రాజ్‌గిరిలో 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు కోచ్‌గా చీపురుపల్లి మండలానికి చెందిన పాలూరి చైతన్య ఎంపికయ్యారు. చైతన్య ప్రస్తుతం శాప్ కబడ్డీ కోచ్‌గా విశాఖ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో విధులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన చైతన్యను ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎలమంచిలి శ్రీకాంత్, విజయనగరం కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కోరాడ ప్రభావతి అభినందించారు.

గిరిజనుల పొట్ట కొట్టొద్దు



నిరసన తెలుపుతున్న మారిక, పాత మారిక గ్రామాల గిరిజనులు



ఉద్యమానికి సిద్ధమంటూ బాణాలు ఎక్కి పెట్టిన సీపీఎం నాయకులు

వేపాడ: హైడ్రో పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు అదానీ కంపెనీకి భూములు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని కరకవలస పంచాయతీ గిరిశిఖర మారిక గ్రామంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో గిరిజనులు ఆందోళన కొనసాగిస్తున్నారు. శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి సీపీఎం ఆల్ ఇండియా కమిటీ సభ్యుడు లోకనాథం, సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ తాతల, తండ్రుల నుంచి కొండలను నమ్ముకుని జీవిస్తున్న గిరిజనుల పొట్టకొట్టొద్దని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచ్‌తో కాని, ఇక్కడి ప్రజలతో కాని ప్రభుత్వం మాట్లాడకుండా గిరిజనులు నివసిస్తున్న కొండలు, గుట్టల్లో దాదాపు 213 ఎకరాలు అదానీకి ఇస్తున్నట్లు ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. గిరిశిఖర గ్రామాలకు రోడ్లు వేయాలన్న, అక్కడి గిరిజనులకు పట్టాలు ఇవ్వాలన్నా అటవీశాఖ అనుమతులు ఉండాల ని చెబుతున్న ప్రభుత్వం.... ఇప్పుడు మరి ఏ అనుమతులు తీసుకుని అదానీకి ఇస్తున్నారని ప్రశ్నించారు. తమ్మినేని సూర్యనారా యణ మాట్లాడుతూ అధికారులు ముందుగా గ్రామసభ నిర్వహించి, 70శాతం మంది ప్రజలు అనుమతిస్తేనే భూసేకరణ చేయాలని చట్టం చెబుతున్నప్పటికీ ప్రభుత్వం అవేమీ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వమే చట్టాన్ని అతిక్రమించి గిరిజనులను ఇబ్బంది పెట్టేందుకు సిద్ధమయ్యిందని మండిపడ్డారు. 125 గిరిజన కుటుంబాలకు అన్యాయం చేస్తుంటే సహించేది లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉత్తర్వులను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కరకవలస సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, సీపీఎం, ఏపీ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్ల కొరత



ఐసీడీఎస్ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: సమగ్ర శిశు అభివృద్ధి సేవలు (ఐసీడీఎస్)లో సూపర్‌వైజర్ల కొరత నెలకొంది. పర్యవేక్షణ లోపం వెంటాడుతోంది. జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 293 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 2,206 మెయిన్ కేంద్రాలు. వీటి పరిధిలో 0 నుంచి 6 నెలలలోపు పిల్లలు 5,889 మంది ఉన్నారు. 7 నెలలు నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలు 39,976 మంది, 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న పిల్లలు 27,918 మంది ఉన్నారు. వాస్తవంగా ఐసీడీఎస్‌లో 100 సూపర్ వైజర్లు ఉండాలి. ప్రస్తుతం 71 మంది మాత్రమే ఉన్నారు. 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో గ్రేడ్ -1 సూపర్ వైజర్ పోస్టులు 54 కాగా 52 మంది ఉన్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్ సూపర్ వైజర్ పోస్టులు 46 కాగా 16 మంది రెగ్యులర్ సూపర్ వైజర్లు, ముగ్గురు కాంట్రాక్ట్ సూపర్ వైజర్లు ఉన్నారు. 27 సూపర్ వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ లోపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విధులు ఇలా..

ఒక్కో సూపర్ వైజర్ 20 నుంచి 25 అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి. పోస్టుల ఖాళీలతో కొంతమంది సూపర్ వైజర్లు 50 కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. సరుకుల సరఫరా, నాణ్యత లోపిస్తే సరుకులను తిప్పిపంపించడం, అంగన్‌వాడీ కార్యకర్తలు అందించే సేవలు ఆన్‌లైన్ నమోదులో సాంకేతిక సమస్యలు పరిష్కరించడం, అంగన్‌వాడీ కార్యకర్తకు, సీడీపీఓకు సమన్వయకర్తగా వ్యవహరించడం వంటి విధులను సూపర్ వైజర్లు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని, ఖాళీల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఐసీడీఎస్ డీపీ రుక్సానా సుల్తానా బేగం తెలిపారు.



విజయనగరం పట్టణం తోటపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులు